సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 27 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.25
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/ 20.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

క్లుప్తంగా

గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి
- ప్రజలకు కలెక్టర్ వినాయక చవితి శుభాకాంక్షలు



పుట్టపర్తి టౌన్: గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలోనూ సుఖశాంతులు నిండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందరూ ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ అందరూ మట్టి విగ్రహాలనే కొలువుదీర్చాలన్నారు.

పండుగ ప్రశాంతంగా చేసుకోండి
వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎస్పీ రత్న ఆకాంక్షించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏకదంతుడి దయతో అందరికీ విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు.

గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిద్దాం



మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

హిందూపురం: స్వీయ నియంత్రణ, వ్యక్తిగత క్రమశిక్షణతో గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుందామని ఎస్పీ వి.రత్న సూచించారు. మంగళవారం ఆమె హిందూపురం పట్టణం పరిగి రోడ్డులోని కంచి కామాక్షి కల్యాణ మండపంలో గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గణేష్ వేడుకలకు హిందూపురం రాష్ట్రంలోనే పేరుగాంచిందన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరిగేలా అన్ని సంఘాలు యువకులు, గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు సహకరించాలన్నారు. డీజే శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయాలు కలగకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున, డీఎస్పీ మహేష్‌లు మాట్లాడారు.

'పేటీఎం'కు వినియోగదారుల కమిషన్ జరిమానా
అనంతపురం సెంట్రల్: పేటీఎం కంపెనీకి జరిమానా విధిస్తూ అనంతపురం వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. శింగనమలకు చెందిన తన్వీర్‌బాషా పేటీఎం కంపెనీపై దాఖలు చేసిన ఫిర్యాదుపై కమిషన్ మంగళవారం తుది తీర్పు ఇచ్చింది. 2023 ఫిబ్రవరి 27న తన్వీర్‌బాషా పేటీఎం సౌండ్‌బాక్స్‌ను కొనుగోలు చేశారు. తర్వాత డియాక్టివేట్ చేయమని అభ్యర్థించినప్పటికీ కంపెనీ వినియోగదారుని అనుమతి లేకుండా రూ.2,480 మొత్తాన్ని ఖాతా నుంచి డెబిట్ చేసింది. బాధితుడు పలుమార్లు కంపెనీ కస్టమర్ కేర్, గ్రీవెన్స్‌సెల్‌ను సంప్రదించిన స్పందనా రాలేదు. దీంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం కంపెనీ నిర్లక్ష్యం, లోపభూయిష్టమైన సేవలు ఉన్నట్లు తేలడంతో వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యురాలు గ్రేస్‌మేరీ బాధితుని ఖాతా నుంచి డెబిట్ చేసిన మొత్తానికి 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని తీర్పు వెలువరించారు. అలాగే వినియోగదారుడు ఎదుర్కొన్న మానసిక వేదనకు పరిహారంగా రూ.20 వేలు, న్యాయపరమైన వ్యయాల కోసం మరో రూ.5 వేలను 45 రోజుల్లోపు చెల్లించాలని, ఆలస్యమైతే 12 శాతం వడ్డీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



'పురం'లో వినాయక ప్రతిమలు కొంటున్న దృశ్యం



కదిరిలో అరటి ఆకులు విక్రయిస్తున్న మహిళలు



మడకశిర నుంచి వినాయకుడి విగ్రహాన్ని తీసుకువెళ్తున్న చిన్నారులు

ఊరూవాడా 'చవితి' సంబరం
- నేడు వినాయక చవితి
- కొలువుదీరనున్న గణనాథులు
- పండగ కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

పుట్టపర్తి టౌన్: చవితి సంబరానికి సర్వం సిద్ధమైంది. విఘ్నాలు తీర్చే విఘ్నేశ్వరుడిని వాడవాడలా కొలువుదీర్చేందుకు ఇప్పటికే మండపాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. విగ్రహాలు, పూజ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. మామిడాకులు, చెరకు గడలు, వెలక్కాయలు, పండ్లు, పూలు కొనుగోళ్లకు జనం ఉత్సాహం చూపగా... ధర్మవరం, హిందూపురం, పుట్టపర్తి, కదిరి, మడకశిర ప్రాంతాల్లో పండుగ సందడి కనిపించింది. కొన్నిచోట్ల మట్టి విగ్రహాలను కొలువుదీర్చాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. బుధవారం ఉదయమే విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి మండపాల్లో కొలువుదీర్చనున్నారు.



పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న ధర్మవరం మార్కెట్



పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమను తీసుకు వెళ్తున్న యువతి

దొరికేనా ఆ బంగారం?
- సవాలుగా మారిన హిందూపురం బ్యాంకు దోపిడీ కేసు
- ఇటీవల ఒక దొంగ అరెస్టు
- రెండు కేజీల బంగారం రికవరీ
- లభించని మరో నిందితుడి ఆనవాళ్లు
- అతని వద్దే తొమ్మిదిన్నర కిలోల బంగారం



చోరీ జరిగిన హిందూపురం ఎస్‌బీఐ ఎదుట ఆందోళనలో ఖాతాదారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని ఎస్‌బీఐ (స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో దోపిడీ జరిగి రేపటికి సరిగ్గా నెల రోజులవుతోంది. ఎక్కడా ఆనవాళ్లు కూడా లభించకుండా పదకొండున్నర కిలోల బంగారం, రూ.30 లక్షల నగదును దుండగులు దోచుకెళ్లడం అప్పట్లో ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన నుంచి ఇప్పటికీ స్థానికులు తేరుకోలేకపోతున్నారు. చోరీ అయిన బంగారం మొత్తం రైతులు, వివిధ వర్గాలు తనఖా పెట్టిందని తెలిసింది. ఘటనాస్థలిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమికంగా లభించిన ఆధారాల మేరకు బిహార్ లేదా ఉత్తరప్రదేశ్‌కు చెందిన దొంగలు చేసిన పనిగా గుర్తించారు.

ఒక నిందితుడు చిక్కినా..
కేసు ఛేదనకు తీవ్రంగా శ్రమిస్తున్న పోలీసులకు నాలుగు రోజుల క్రితం ఒక దొంగ దొరికాడు. అతని నుంచి 2 కేజీల బంగారాన్ని పోలీసులు రికవరీ చేశారు. కేసులో ఇది కొద్దిగా ఉపశమనం కలిగించే విషయమే అయినా మిగతా తొమ్మిదిన్నర కేజీల బంగారం ఎక్కడుందో తెలియకపోవడమే ఆందోళన కలిగిస్తోంది. దీనికి తోడు పట్టుబడిన దొంగకు బ్యాంకు దోపిడీలో వాటా చాలా చిన్నదని వెల్లడైనట్లు తెలిసింది. దీంతో అసలు దొంగ కోసం పోలీసులు మళ్లీ గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన ఆరు బృందాలు రంగంలోకి దిగాయి. మధ్యప్రదేశ్, బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలతో పాటు అనుమానం వచ్చిన ప్రతిచోటా లాడ్జీలు, హోటళ్లలో జల్లెడ పడుతున్నాయి.

చిన్న క్లూ కూడా లేదు
శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు..ముఖ్యమైన దొంగకి సంబంధించి చిన్న ఆధారం కూడా లభించడం లేదు. అపహరించిన బంగారాన్ని ఇప్పటికే ముంబై లేదా బెంగళూరు ప్రాంతాల్లో విక్రయించి ఉంటారని భావిస్తున్నారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానం వాడి బ్యాంకు తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించడం.. ఎక్కడా వేలిముద్రలు, పాద ముద్రలు పడకుండా జాగ్రత్త పడడం.. అసలు ఫోనే వాడకపోవడం.. ఎలాంటి వాహనాన్ని వినియోగించకపోవడంతో అతడిని పట్టుకోవడం కత్తిమీద సాములా మారింది.

ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద దోపిడీ
హిందూపురం బ్యాంకు దోపిడీ కేసును ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతిపెద్ద దోపిడీ కేసుగా పోలీసులు చెబుతున్నారు. అనంతపురం నగర శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఇటీవల జరిగిన దొంగతనం సొత్తు విలువ రూ.3 కోట్లే. కానీ హిందూపురం బ్యాంకు దోపిడీ కేసులో బంగారం , నగదు విలువ కలిపి రూ.12 కోట్ల వరకూ ఉంటుంది.

హిందూపురం బ్యాంకు దోపిడీ వివరాలు ఇలా...

దోపిడీ జరిగిన తేదీ	2025 జులై 28
దోచుకెళ్లిన బంగారం	11.6 కేజీలు
దీని విలువ	రూ.10.50 కోట్లు
నగదు తీసుకెళ్లింది	రూ.30 లక్షలు
ఇప్పటివరకు బంగారం రికవరీ	2 కేజీలు

చేనేత కార్మికుడి బలవన్మరణం



సోమశేఖర్‌రెడ్డి (ఫైల్)

చిలమత్తూరు: అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం మండల పరిధిలోని లాలేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లాలేపల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ రెడ్డి (38) సోమందేపల్లిలో మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. వివాహమైనా సంతానం కలుగలేదు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. సోమందేపల్లిలోనే ఇళ్లు నిర్మించుకున్న సోమశేఖర్‌రెడ్డి ఇందుకోసం అప్పులు చేశాడు. ఇటీవల మగ్గంపై తగినంత రాబడి లేకపోవడం... ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరగడం.. అప్పులు తీర్చే మార్గం కనిపించక మధనపడేవాడు. ఈ క్రమంలోనే సోమవారం స్వగ్రామం చిలమత్తూరు మండలం లాలేపల్లికి వచ్చిన సోమశేఖర్‌రెడ్డి అప్పుల గురించే కుటుంబీకులకు చెప్పాడు. ఏమైందో ఏమో గానీ మంగళవారం ఉదయమే గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- తనకల్లులోని 30 పడకల ప్రభుత్వాసుపత్రి తనిఖీ



తనకల్లు ప్రభుత్వాసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

తనకల్లు: రోగులకు మెరుగైన సేవలను అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన తనకల్లులోని 30 పడకల ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి..వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పనితీరు గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్య గురించి సూపరింటెండెంట్ విజయ్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రోజూ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య, మందుల నిల్వ గురించి ఆరా తీశారు. మందుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆక్సిజన్ ప్లాంట్, లేబరేటరీ, ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్ గదులను పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

షెడ్ నెట్ హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్
మండలంలోని సీఆర్ పల్లి సమీపంలో ఉద్యానశాఖ, 'సెర్ప్' ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్ నెట్ హౌస్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం పరిశీలించారు. అలాగే చౌడేశ్వరీ ఎఫ్‌పీఓ కలెక్షన్ సెంటర్, సోలార్ కోల్డ్ రూంలను పరిశీలించారు. ఎఫ్‌పీఓ ద్వారా మార్కెటింగ్‌ను అభివృద్ధి చేసి ఇక్కడ పండిన కూరగాయలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఉన్నారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన
గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులను మంగళవారం కలెక్టర్ టీఎస్ చేతన్ పరిశీలించారు. పనుల పురోగతిని ఎన్‌హెచ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుట్టపర్తి మండలం గువ్వలగుట్టపల్లి వద్ద జరుగుతున్న రహదారి పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి
- నాగరాజు యాదవ్ అవినీతిని బయటపెడతాననే నాపై హత్యాయత్నం



పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు : ''ఈ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాగరాజు యాదవ్ అవినీతి అక్రమాలను తప్పక ప్రజల ముందు ఉంచుతా. ఎక్కడ ఎవరి పేరు మీద పట్టా పొందాడో బయటపెడతా. ఆయన అవినీతిని బయటపెడతాననే నాపై హత్యాయత్నం చేశాడు. అయినా వదిలేది లేదు.'' అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ నేతలతో కలిసి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాగరాజు యాదవ్‌ను కొత్తచామలపల్లి నుంచి ప్రజలు తరిమేస్తే చిలమత్తూరు వచ్చి స్థిరపడ్డారన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరుతూ అధికారాన్ని అనుభవించడమే కాకుండా అవినీతి అక్రమాలు చేశాడన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వలస వెళ్లిన నాగరాజు యాదవ్‌కు అనతి కాలంలోనే అన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కోడూరు, టేకులోడు, చిలమత్తూరు పంచాయతీల్లో ఆయన భార్య వినోదమ్మ పేరిట ఎన్ని అసైన్డ్ పట్టాలున్నాయో తనకు తెలుసుని, అవి ఎలా సంక్రమించాయని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తామన్నారు. తన అవినీతి అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే నాగరాజు యాదవ్ తనపై హత్యాయత్నం చేయించారన్నారు.

ఈగవాలినా ఉపేక్షించేది లేదు
పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ గూండాలు ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. దాడి చేసి చంపాలని కుట్ర చేసింది కాకుండా.. ఉద్దేశ పూర్వకంగానే తమ ప్రెస్‌మీట్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ నేతలపై కానీ, కార్యకర్తలపై కానీ ఈగ వాలినా ఉపేక్షించబోమన్నారు. ఎల్లకాలం అధికారంలో ఉండరన్న విషయం నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. వారికి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ఎస్సీ సెల్ నేత చిన్నప్పయ్య మాట్లాడుతూ... కోడూరు పంచాయతీ టీడీపీ నేత బేకరీ గంగాధర్ తమ పార్టీపై, ఎంపీపీపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అధికారంలో ఉంటే పార్టీ పేరు, అధికారం లేకపోతే కులం పేరు వాడుకుంటున్నారని... ఇలాంటి వాళ్లకు తమ పార్టీని విమర్శించే అర్హత లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కులశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జయశంకర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీ రఘు, మంజునాథరెడ్డి, ఆదినారాయణ, పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల కన్వీనర్ మద్దిపి లక్ష్మీనారాయణ, లక్ష్మీరెడ్డి, షాకీర్, నవాబ్, ఆయూబ్, శ్రీనాథ్, శంకర్‌రెడ్డి, విష్ణు, నంజిరెడ్డి, దాము, గిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాఫియా డాన్‌ల ఉలికిపాటు
- కొద్దిరోజులు ఆగాలని చిన్న సరఫరాదార్లకు దేశాలు
- ఏమైనా ఉంటే సోమందేపల్లికి బియ్యం తీసుకురావాలని కబురు
- 'సాక్షి'లో కథనం రావడంతో అప్రమత్తం



గుంతకల్లులో పట్టుబడిన బియ్యం బస్తాలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రేషన్ బియ్యం మాఫియా డాన్‌లు అప్రమత్తమయ్యారు. ఈనెల 21న సాక్షిలో 'మాఫియా గుప్పిట్లో రేషన్' శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఒక్కసారిగా బియ్యం మాఫియా డాన్‌లు ఉలిక్కిపడ్డారు. చిన్న చిన్న సరఫరాదారులందరూ ఒక్కసారిగా కలుగుల్లోకి వెళ్లినట్లు తెలిసింది. గతంలో ఎప్పుడూ పెద్ద ఎత్తున మీడియాలో కథనాలు రాలేదని, అందరూ కొన్ని రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని డాన్‌ల నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బియ్యం సేకరించి గోడౌన్‌లకు చేర్చే ఏజెంట్ల మధ్య అనైక్యత కారణంగానే మీడియాకు సమాచారం వచ్చిందని మాఫియా డాన్‌లు తీవ్రంగా మండిపడ్డారు. మీ మధ్య ఉన్న వివాదాల కారణంగా సమాచారం బయటకు వెళుతోందని, జాగ్రత్తగా లేకపోతే మనకు తీవ్ర నష్టం జరుగుతుందని సరఫరా ఏజెంట్లకు చెప్పారు. సేకరించిన బియ్యాన్ని తమ దగ్గరే కొద్ది రోజులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు.

వారం రోజులు డంప్‌ల జోలికి వెళ్లొద్దు..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉంచిన బియ్యం డంప్‌ల జోలికి వెళ్లద్దని మాఫియా భాగస్వాములు అందరూ నిర్ణయించినట్టు తెలిసింది. నాలుగైదురోజులు పోలీసులు, విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయీస్ అధికారులతో సమావేశం నిర్వహించుకుని, తర్వాత సరఫరా చేయాలనేది ప్రధాన ఉద్దేశంగా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే చెక్‌పోస్ట్‌ల అధికారులతోనూ, విజిలెన్స్ వారితోనూ టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం.

ఇకపై సోమందేపల్లికే రండి..
వాస్తవానికి సోమందేపల్లి కేంద్రంగా బియ్యం మాఫియా నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే డంప్‌లు మాత్రం అన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. ఇకపై డంప్‌లకు కాకుండా నేరుగా సోమందేపల్లికి తీసుకురావాలని సదరు మాఫియా డాన్ సరఫరాదారులకు చెప్పారు. అంతకుమించి తమ వాహనాలు డంప్‌ల వద్దకు పంపలేనని, సోమందేపల్లి నుంచి అయితే బంగారుపేట, పావగడకు సులభంగా రవాణా చేసుకోవచ్చనేది ఆలోచనగా ఉన్నట్లు తెలిసింది. దీంతో నాలుగైదు రోజుల నుంచి బియ్యం అక్రమ రవాణా మందగించినట్టు తెలుస్తోంది. మాఫియా డాన్‌గా చెప్పుకుంటున్న ఆర్కే నుంచి ఆదేశాలు రాగానే రవాణా సాగిస్తామంటున్నారు. ఇంతలా బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసులు, విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారుల్లో మాత్రం చలనం లేదు.

జీజీ హట్టిలో మళ్లీ అతిసారం



రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిక్కమ్మ

రొళ్ల: మండల పరిధిలోని జీజీ హట్టి గ్రామంలో మళ్లీ అతిసారం కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే నెలలో గ్రామంలో అతిసారం ప్రబలి 45 మంది అస్వస్థతకు గురికాగా, చిన్నారి అమూల్య (11) మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవకముందే మంగళవారం మళ్లీ అతిసారం కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం గ్రామస్తులు నాగదేవత పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో తయారు చేసిన ఆహారం తిని చిక్కమ్మ, తిమ్మరాజమ్మ, మోహిత్, కుమార్ తదితరులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిని కుటుంబీకులు మంగళవారం రొళ్ల సీహెచ్‌సీ, మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ షేక్షావలి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావుతో పాటు డాక్టర్ శివానంద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అతిసారం లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు.

క్లుప్తంగా

న్యాయవాదిపై ప్రతివాది వర్గీయుల దాడి



చికిత్స పొందుతున్న న్యాయవాది సుధాకర్

పావగడ: ఓ కేసు విషయంగా న్యాయవాదిపై ప్రతివాది వర్గీయులు దాడికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడ తాలూకా దవడబెట్ట గ్రామానికి చెందిన సుధాకర్.. జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తన స్వగ్రామంలో ఓ ఇంటి వివాదానికి సంబంధించిన లీగల్ నోటీసును ఇటీవల తన ప్రతివాది సజ్జీరప్పకు పంపారు. దీంతో కక్ష పెంచుకున్న సజ్జీరప్ప వర్గీయులు మంగళవారం గొల్లరహట్టిలో సుధాకర్‌ను అడ్డుకుని మహిళలతో కలసి 20 మంది దాడి చేశారు. వారి బారి నుంచి తప్పించుకుని దాడిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, న్యాయవాదులు బాధితుడు సుధాకర్‌ను పరామర్శించారు.

సమాధులే దేవాలయాలు

- సుబ్బరావుపేటలో వింత ఆచారం
- సమాధుల వద్ద ఏటా ఉత్సవాలు

ధర్మవరం రూరల్: మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో వింత ఆచారం కొనసాగుతోంది. గ్రామంలోని ఓ కుటుంబం వారు వారి పితృదేవతలను మరచిపోకుండా వారి సమాధులపై విగ్రహాలు ఏర్పాటు చేసుకుని పూజిస్తున్నారు. గ్రామంలోని బొమ్మయ్య కుటుంబ సభ్యులు మాత్రమే ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. బొమ్మయ్య వంశానికి చెందిన సుమారు 20 కుటుంబాలు ఉన్నాయి. వీరి కుటుంబాలలో ఎవరైనా మృతి చెందితే గ్రామం వెలుపల ప్రత్యేక స్థలంలో ఖననం చేసి సమాధులు నిర్మిస్తారు. అనంతరం వాటిపై వారి ముఖచిత్రాన్ని పోలిన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజిస్తుంటారు.

ఏటా సమాధుల వద్ద పరుష

ఏటా విత్తన ఏకాదశి రోజున సమాధుల వద్ద పరుష నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ సమాధులకు పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ పరుషకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారని బొమ్మయ్య వంశస్తులు చెపుతున్నారు.



బొమ్మయ్య సమాధికి పూజలు చేసిన దృశ్యం (ఫైల్)



పరుష సందర్భంగా సమాధుల వద్ద పూజలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

పితృదేవతల ఆశీస్సుల కోసం



పితృదేవతల ఆశీస్సుల కోసం మా వంశస్తులు ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. వారి రూపాలను సమాధులపై నిర్మించుకుంటాం. విత్తన ఏకాదశి రోజున సమాధుల వద్ద పరుష నిర్వహిస్తాం. మా ఇళ్లల్లో పుట్టిన మగ పిల్లలకు బొమ్మయ్య అనే పేరు తప్పనిసరిగా పెట్టుకుంటాం. గంగమ్మను మా ఇలవేల్పుగా పూజిస్తుంటాం. గ్రామంలో నిర్మించిన గంగమ్మ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సమాధుల వద్దకు తీసుకెళ్లి అక్కడ కూడా పూజలు చేస్తుంటాం.

– నడిపి బొమ్మయ్య, గంగమ్మ ఆలయ పూజారి, సుబ్బరావుపేట

ఏ నోట విన్నా.. అదే చర్చ!

- గంజాయి కేసులో కూలీలను అరెస్టు చూపి కీలక నిందితులను తప్పించిన పోలీసులు
- ప్రస్తుతం కదిరిలోని ప్రతి టీ కొట్టులోనూ ఇదే అంశంపై చర్చ



ఈ నెల 24న పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

కదిరి: పట్టణంలో ఇప్పుడు గంజాయి హాట్ టాపిక్‌గా మారింది. ఏ టీ కొట్టులో కూర్చొన్నా దానిపైనే చర్చ జరుగుతోంది. ఏడాదిగా కదిరి ప్రాంతంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న కీలక సూత్రధారులను కదిరి పోలీసు అధికారులు ఈ కేసు నుంచి తప్పించినట్లు ఆరోపణలున్నాయి. ఇందుకుగాను రూ.30 లక్షలు ముడుపులను పోలీసులు దండుకున్నట్లు చర్చ జోరుగా సాగుతోంది. ఇందులో రూ.10 లక్షల వరకు జిల్లా కేంద్రానికి కూడా చేరినట్లు వినబడుతోంది.

దాచేస్తే దాగదులే..

కదిరి మండలం కొండమనాయునిపాళ్యం వద్ద ఈ నెల 26న మంగళవారం గంజాయి ముఠాను అరెస్ట్ చేస్తే 4 రోజుల తర్వాత అంటే ఈ నెల 29న శుక్రవారం అరెస్ట్ వివరాలను పోలీసులు వెల్లడించారు. ఈ జాప్యం వెనక ఆంతర్యమేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పటికే గంజాయి పట్టుబడిన విషయం మీడియాలోనే కాకుండా సోషల్ మీడియాలోనూ బాగా వైరల్ అయింది. లేదంటే ఈ కేసు నమోదయ్యేదే కాదు. గంజాయి అసలు సూత్రధారులతో స్థానిక పోలీసు అధికారులకు డీల్ కుదిరిన తర్వాతే అరెస్ట్ వివరాలు వెల్లడించారని కొందరంటున్నారు.

వారంతా కూలీలే

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కదిరితో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. కూటమి నేతలే కొందరు ఈ దందాను నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్రలోని జలగాం జిల్లా ప్రజాపూర్‌లోని వాటర్ ట్యాంక్ ఏరియాలో ఉంటున్న రవి అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైళ్లు, బస్సుల్లో ఎంపిక చేసుకున్న కూలీల ద్వారా ఇక్కడికి తెప్పిస్తున్నారు. కూలీలకు రైలు లేదా బస్సు చార్జీలు ఇవ్వడంతో పాటు కిలోకు రూ.1000 చొప్పున కూలి చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కదిరి రూరల్ పోలీసులకు పట్టుబడిన స్థానిక జామియా వీధికి చెందిన అజాజ్, నాగరాజు వీధికి చెందిన షోయబ్, గాంధీనగర్‌కు చెందిన ఆర్బాన్, మహమ్మద్ హుస్సేన్, అస్లాం, గౌసియా వీరంతా కమీషన్ ప్రాతిపదికన గంజాయిని తెచ్చే కూలీలు మాత్రమే. దీని వెనుక అసలు సూత్రధారులు వేరే ఉన్నారని తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన ఒక ప్రముఖ నేత ఇంట్లో చర్చలు జరిపిన అనంతరం కీలక నిందితులను తప్పించి, కేవలం కూలీల పేర్లు మాత్రమే వెల్లడించేలా ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. అసలు సూత్రధారులు ఎవరనే విషయం స్థానికంగానే కాకుండా ఉన్నతాధికారులకు సైతం బాగా తెలుసని, అయితే వారు దీనిని ‘మామూలు’గా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. గంజాయి అక్రమ రవాణాను అరికట్టి అసలు సూత్రధారుల ఆట కట్టించకపోతే యువత గంజాయికి బానిసై చెడుమార్గంలో వెళ్లడం ఖాయమని పలువురు అంటున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా సీరియస్‌గా తీసుకుని గంజాయిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

తప్పుల తడకగా మెరిట్ జాబితా

- సమగ్ర శిక్షలో సెక్టోరియల్ ఉద్యోగాల నియామకాల్లో రాజకీయ జోక్యం
- భగ్గుమంటున్న ఉపాధ్యాయ సంఘాలు

పుట్టపర్తి: సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధికారుల నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. రాజకీయ నేతల కనుసన్నల్లోనే నియామకాలు చేపడుతుండడంతో ఉపాధ్యాయ సంఘాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. మంగళవారం డీఈఓ కార్యాలయం సిబ్బంది ప్రకటించిన మెరిట్ జాబితా మొత్తం తప్పుల తడకగా ఉందని, అనర్హులను అందలమెక్కించే ప్రయత్నం చేస్తున్నారంటూ యూటీఎఫ్, ఎస్టీయూ, వైఎస్సార్‌టీయూ, ఏపీటీఎఫ్ 1938 సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయా సంఘాల నేతలు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, సజ్జల హరిప్రసాద్‌రెడ్డి, పీవీ రమణారెడ్డి, లీలా ఇంద్రప్రసాద్, బడా హరిప్రసాదరెడ్డి తదితరులు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 9 పోస్టులకు గాను గత గురువారం బుక్కపట్నం డైట్ కళాశాలలో 34 మంది అభ్యర్థులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. వీరిలో అర్హత ఉన్న వారికి మార్కులు వేయకుండా ఏ మాత్రం అనుభవం లేని అనర్హులకు అధిక మార్కులు వేయడం దారుణమన్నారు. ఏ ప్రాతిపదికన మార్కులు వేశారో స్పష్టం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. సెక్టోరియల్ పోస్టులు తమకే వస్తాయంటూ టీడీపీ మద్దతు ఉన్న ఉపాధ్యాయులు గతంలో బహిరంగంగానే పేర్కొన్నారని, వారు చెప్పినట్లుగానే పని చక్కబెట్టి అక్రమాలకు అధికారులు ఊతమిచ్చారంటూ మండిపడ్డారు. అర్హులకు న్యాయం చేకూరకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

నమ్మించి.. ప్రాణం తీశారు!

- హిందూపురం వివాహిత మృతి కేసులో వీడిన మిస్టరీ
- బంగారం కోసమే హతమార్చినట్లు నిర్ధారణ
- ఇద్దరి అరెస్టు



హతురాలు అర్చన (ఫైల్)

గౌరీబిదనూరు (కర్ణాటక): ఇటీవల కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా పరిధిలో లభ్యమైన అపరిచిత మహిళ మృతదేహం కేసులో మిస్టరీ వీడింది. హతురాలిని హిందూపురం ప్రాంతానికి చెందిన అర్చనగా నిర్ధారించిన పోలీసులు ఆమెను హతమార్చిన ఓ యువకుడు, యువతిని అరెస్టు చేశారు. మంగళవారం గౌరీబిదనూరు తాలూకా మంచేనహళ్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను పోలీసులు వెల్లడించారు. హిందూపురం సమీపంలోని శ్రీకంఠాపురానికి చెందిన వడ్డే అర్చన (27) క్యాటరింగ్ పని చేసేది. ఈ నెల 14న పనికి వెళ్లిన ఆమె కనిపించకుండా పోయింది. దీంతో అర్చన భర్త ఫిర్యాదు మేరకు హిందూపురం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

చున్నీతో గొంతు నులిమి..

అర్చనకు కేటరింగ్ పనిలో బెంగళూరుకు చెందిన రాకేష్, అంజలితో పరిచయం ఏర్పడింది. అందరూ ఆప్త స్నేహితులుగా మెలిగేవారు. హిందూపురం, బెంగళూరులో ఎక్కడ కేటరింగ్ పనులు ఉన్నా కలిసి వెళ్లేవారు. అయితే ఆర్థిక సమస్యల్లో ఉన్న రాకేష్‌కు అర్చన ధరించే బంగారు నగలపై ఆశ పుట్టింది. 14న అర్చనను పని ఉందని రాకేష్ పిలిపించుకున్నాడు. అనంతరం కారులో చిలమత్తూరు, లేపాక్షి, పెరేసంద్ర, గౌరీబిదనూరు తదితర ప్రాంతాల్లో తిప్పి చివరకు నామగొండ్లు సమీపంలో చున్నీతో ఆమె గొంతు బిగించి హతమార్చాడు. ఆమె మెడలోని బంగారు నగలను తీసుకుని మృతదేహాన్ని అక్కడే ఓ వంతెన కింద పడేసి.. ఎవరూ గుర్తించకుండా బండరాళ్లతో ముఖాన్ని ఛిద్రం చేసి ఉడాయించాడు. అనంతరం బంగారాన్ని రూ. 1.95 లక్షలకు కుదువపెట్టి తన ఆటో రుణం కంతు చెల్లించాడు.

పరారీలో డ్రైవర్, మరో యువతి

ఈ నెల 17న మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల ఫిర్యాదు మేరకు మంచేనహళ్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని మహిళ హత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనంతరం హతురాలిని హిందూపురానికి చెందిన అర్చనగా నిర్ధారించారు. ఈ క్రమంలో అనుమానితులపై నిఘా ఉంచారు. ఆమెకు అందిన ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా నిందితుడు రాకేష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవం బయటపడింది. దీంతో రాకేష్‌తో పాటు అతనికి సాయపడిన అంజలిని మంగళవారం అరెస్ట్ చేసి, బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి సహకరించిన కారు డ్రైవర్ నవీన్, మరో నిందితురాలు నిహారిక పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్‌కు విశేష స్పందన

అనంతపురం సిటీ/పుట్టపర్తి టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) కేవలం రూపాయికే అందుబాటులోకి తీసుకొచ్చిన ఫ్రీడమ్ ప్లాన్‌కు విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ ఉమ్మడి జిల్లా మేనేజర్ షేక్ ముజీబ్ పాషా మంగళవారం తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక ప్లాన్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 10 వేల మంది వినియోగదారులు లబ్ధి పొందారన్నారు. ఈ ప్లాన్ ద్వారా రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాల్స్ వంటి ప్రయోజనాలను సిమ్ యాక్టివేషన్ చేసిన రోజు నుంచి నెల రోజుల పాటు కేవలం రూ.1కే అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లికి చెందిన నాగరాజు (45) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయనకు భార్య ఆర్వేటి లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జీవాల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా గొర్రెల మేపునకు వెళ్లకుండా నాగరాజు మద్యం తాగుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. సోమవారం ఉదయం లక్ష్మీదేవి గొర్రెలను మేపడానికి వెళ్లి సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకుంది. రాత్రి 7 గంటల సమయంలో నాగరాజు మృతి చెందిన విషయం బయటపడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది మంగళవారం ఉదయం ఆ గ్రామానికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. నాగరాజు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోదరుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ శ్మశాన వాటిక పూడ్చివేత

- ఎన్‌హెచ్ 342 రోడ్డు పనుల్లో భాగంగా..



శ్మశాన వాటికలో పడేసిన బండరాళ్లు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ముదిగుబ్బ నుంచి కోడూరు వరకూ నిర్మిస్తున్న 342వ జాతీయ రహదారి పనుల్లో భాగంగా పుట్టపర్తి సమీపంలోని కర్నాటక నాగేపల్లి వద్ద బైపాస్ సమీపంలో ఎస్సీ శ్మశాన వాటికను కాంట్రాక్టర్ పూడ్చి వేయడం వివాదాస్పదంగా మారింది. మిగులు మట్టి, బండ రాళ్లతో శ్మశాన వాటికను పూడ్చి వేస్తున్నారని పలువురు ఎస్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలోని వంక పొరంబోకు స్థలంలో 2.84 ఎకరాల్లో ఒక ఎకరాను ఎస్సీ శ్మశాన వాటికకు 2018లో కేటాయించారు. ఇప్పటికైనా శ్మశాన వాటిక పూడ్చివేతను ఆపాలంటూ గ్రామానికి చెందిన రమేష్, గంగాద్రి, ఆదినారాయణ, సూరి, కేశప్ప, శ్రీరాములు, గంగన్న తదితరులు కోరారు.

పలువురికి తెలుగు భాషా పురస్కారాలు



పురస్కారాన్ని అందుకుంటున్న ఉమర్ ఫారూక్ ఖాన్

హిందూపురం టౌన్: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకుని కవులు, రచయిత్రలకు అందజేసే తెలుగు భాషా పురస్కారాన్ని హిందూపురానికి చెందిన ఉమర్‌ఫారూక్ ఖాన్ అందుకున్నారు. ప్రతి పదం చైతన్యం కోసం, ప్రతి పదం ప్రగతి కోసం అనే ఆశయంతో లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షుడు వడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో హిందూపురంలోని శేఖర్ స్టడీ సెంటర్ వేదికగా మంగళవారం పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. భారత దేశ నిర్మాణంలో ముస్లిం దేశ భక్తుల పాత్రపై ఉమర్ ఫారూక్ రచించిన ‘భారతీయ ముస్లిం లెజెండ్స్’ పుస్తకాన్ని అవార్డుకు ఎంపిక చేశారు. అలాగే తాడిపత్రికి చెందిన కనుమ యల్లారెడ్డి రచన ‘మొలక కథలు’, అనంతపురానికి చెందిన షహనాజ్ రచన ‘దీపం’, హిందూపురానికి చెందిన కల్లూరు రాఘవేంద్రరావు రచన ‘కల్లూరు సుబ్బారావు జీవిత చరిత్ర’, గుంటూరు కొలకలూరి దేవికారాణి రచన ‘స్వప్న వేణువు’, అశోక్ కుమార్, భాను తేజశ్రీ, తాటి హరీష్, లీలా మనోహర్, మల్లెల గంగాధర్ తదితరుల రచనలకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర జానపద అకాడమీ, అధికార భాషా సంఘం విశ్రాంత చైర్మన్ పొట్లూరి హరికృష్ణ, హిందూపురం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కుమార్, ఎంఈఓ గంగప్ప, ఉషారాణి, కల్లూరు రాఘవేంద్రరావు, హెల్పింగ్ హ్యాండ్ శ్రీధర్ గౌడ్, సైనిక సంక్షేమ నాయకులు చలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

భార్యపై దాడి

- పీఎస్‌లో లొంగిపోయిన భర్త



చికిత్స పొందుతున్న రాధమ్మ

మడకశిర: హైరిస్క్ కేసులో గర్భిణికి ఆస్పత్రిలో వైద్యులు ఎక్కిస్తున్న రక్తంపై అనుమానంతో భర్త దాడికి తెగబడ్డాడు. ఘటనలో గర్భిణికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన ఓబులేసు, రాధమ్మ దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం రాధమ్మ 9 నెలల గర్భంతో ఉంది. రక్తహీనతతో బాధపడుతున్నట్లుగా గుర్తించిన వైద్యులు ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా రక్తం ఎక్కించుకోవాలని సూచించారు. దీంతో భర్తతో పాటు తన తల్లిని తోడుగా పిలుచుకుని సోమవారం రాత్రి మడకశిరలోని ఏరియా ఆస్పత్రికి చేరుకుంది. ఆమెను అడ్మిట్ చేసుకున్న వైద్యులు.. హిందూపురం నుంచి ఆమెకు అవసరమున్న గ్రూపు రక్తాన్ని తెప్పించి మంగళవారం తెల్లవారుజామున ఎక్కించారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఓబులేసు రక్తం హిందూపురం నుంచి తెప్పించినది కాదని, వేరే వారి నుంచి తీసుకున్న రక్తాన్ని ఎలా ఎక్కించుకుంటావంటూ భార్యతో గొడవపడి బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో రాధమ్మ గట్టిగా కేకలు వేయడంతో రోగులు, వారి సహాయకులు అప్రమత్తమై దాడిని అడ్డుకున్నారు. అప్పటికే రాధమ్మ దవడ కింద లోతైన గాయమైంది. స్పందించిన వైద్యులు ఆగమేఘాలపై ఆమెకు చికిత్స అందించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. దాడి అనంతరం ఓబులేసు నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని లొంగిపోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య

రొళ్ల: భార్య మృతితో మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన శివరాజు (35)కు రొళ్ల మండలం రత్నగిరికి చెందిన శివలింగప్ప కుమార్తె రత్నమ్మతో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. రెండు నెలల క్రితం రత్నమ్మ మృతి చెందింది. అప్పటి నుంచి శివరాజు మనోవేదనకు లోనయ్యాడు. మంగళవారం ఉదయం రత్నగిరిలో తన భార్య తండ్రి నిర్వహిస్తున్న హోటల్ ఎదుట శివరాజు అపస్మారకస్థితిలో పడి ఉండడం గమనించిన శివలింగప్ప వెంటనే స్థానికుల సాయంతో కర్ణాటకలోని మధుగిరిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స ఫలించక సాయంత్రం ఆయన మృతి చెందాడు. భార్య మృతితో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతుడి తల్లి లక్ష్మీదేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరమ్మతుకు వెళ్లి.. మృత్యు ఒడికి


- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి
- లైన్‌మెన్ నిర్లక్ష్యమే కారణమంటూ భార్య ఫిర్యాదు



విద్యుత్ స్తంభంపై ఉన్న చంద్రశేఖర్ మృతదేహం

తనకల్లు: మండలంలోని ఉస్తినిపల్లి సమీపంలో విద్యుదాఘాతంతో చంద్రశేఖర్ (30) అనే యువకుడు మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు తెలిపిన మేరకు... విద్యుత్ శాఖ లైన్‌మెన్ షఫీ వద్ద కొద్ది రోజులుగా మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ (చందు) దిన కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఉస్తినిపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మెన్ షఫీ, చంద్రశేఖర్ కలసి వెళ్లారు. పనులు చేసే ముందు లైన్‌మెన్ కొక్కంటి లైనుకు ఎల్‌సీ తీసుకోవాల్సి ఉండగా.. వంకపల్లి లైన్‌కు తీసుకున్నాడు. ఇది తెలియని చంద్రశేఖర్ స్తంభం ఎక్కి విద్యుత్ తీగలను తాకగానే షాక్‌కు గురై స్తంభంపైనే మృతి చెందాడు. లైన్‌మెన్ షఫీ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు మారన్న

రొళ్ల: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. రొళ్ల మండలం నసేపల్లి గొల్లహట్టికి చెందిన మారన్న (33)కు భార్య శారదమ్మతో పాటు ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. జీవాల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపం నుంచి గడ్డి మోపు తలపై పెట్టుకుని ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో కిందకు వేలాడుతున్న 11కేవీ విద్యుత్ లైన్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న మారన్న మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మారన్న మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమంటూ స్థానికులు ఆరోపించారు. భూమికి 8 అడుగుల ఎత్తులో 11కేవీ విద్యుత్ లైన్ వేలాడుతున్న విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు స్పందించలేదని మండిపడ్డారు. వారి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జడ్జిలు, లాయర్లపై అనుచిత వ్యాఖ్యలు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మోహన్‌కుమార్

చిలమత్తూరు: జడ్జిలు, లాయర్లపై చిలమత్తూరు మండల టీడీపీ నేత నాగరాజు యాదవ్ అనుచరుడు మోహన్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంగళవారం చిలమత్తూరులో నాగరాజుయాదవ్ ప్రెస్‌మీట్ నిర్వహించాడు. అతని అనుచరుడు, శెట్టిపల్లికి చెందిన మోహన్‌కుమార్ కూడా ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నాడు. తన భూ వివాదం అంశంలో కోర్టుకు తిరగలేకపోతున్నానని చెబుతూ జడ్జిలు, లాయర్లు, అధికారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సంచలనమైంది.